క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడిన సాంబశివరావు

మార్టూరు: జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి గాయపడ్డాడు. 108 సిబ్బంది వివరాల మేరకు.. యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన బత్తుల సాంబశివరావు ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట నుంచి స్వగ్రామం వెళ్తున్నాడు. స్థానిక రాజుపాలెం సెంటర్‌లో యలవర్తి కోల్డ్ స్టోరేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ సాంబశివరావును ఢీ కొట్టడంతో రోడ్డుపై పడి గాయపడ్డాడు. ప్రమాదంలో ఎడమ కాలికి గాయమైన సాంబశివరావును 108 సిబ్బంది చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు


సమావేశంలో పాల్గొన్న ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు

జే.పంగులూరు: పిల్లలకు పౌష్టికాహారం లోపం లేకుండా చర్యలు తీసుకుంటామని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు శివ చెన్నయ్య అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం పిల్లలకు పౌష్టికాహారంపై సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలు మండలంలోని 2131 మంది ఉన్నారన్నారు. వారిలో 10 మంది మాత్రమే పౌష్టికాహారం లోపంతో ఉన్నట్లు తెలిపారు. వారిని అంగన్‌వాడీలు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అవసరమైతే పీహెచ్‌సీకి తీసుకొని వచ్చి డాక్టర్ల పర్యవేక్షణలో ఉండే విధంగా చర్యలు చేపడతామని తెలియజేశారు. 10 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు వెల్ఫేర్ అసిస్టెంట్ పర్యవేక్షిస్తారని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భారతి, హెల్త్ అసిస్టెంట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మీద సుబాబుల్ కర్ర లోడ్ చేస్తే చర్యలు


రహదారి పక్కన సుబాబుల్ లోడ్‌చేస్తున్న కూలీలు

జే.పంగులూరు: జాతీయ రహదారి వెంబడి ఎవరైనా సుబాబుల్ కర్ర లోడ్‌చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేణింగవరం ఎస్సై తిరుపతిరావు హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా శుక్రవారం మండలంలోని జాతీయ రహదారి పక్కన సుబాబుల్ కర్ర లోడ్ చేసే కూలీలకు, కాంట్రాక్టర్లకు, మేస్త్రీలకు, వే బ్రిడ్జిల కాటా యజమానులకు తిరుపతిరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. జాతీయ రహదారి పక్కన సుబాబుల్ లోడ్ చేయడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. ప్రమాదాలు జరిగిన తరువాత ఏమి అనుకున్నా ప్రయోజనం లేదన్నారు. ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే జాతీయ రహదారి పక్కన సుబాబుల్ కర్ర లోడ్‌లు ఆపాలన్నారు. కర్ర లోడ్ చేసుకోవడాలనికి దానికి సంబంధించిన యజమానులు ఏదైనా అనువైనా ప్రదేశాన్ని ఎంచుకొని లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా కర్ర లోడు చేస్తే దానివలన ప్రమాదాలు జరిగితే, ఆ యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆటో ఢీ, యువతికి గాయాలు


క్షతగాత్రురాలిని వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది, స్థానికులు

అద్దంకి రూరల్: స్కూటీపై ఒంగోలు నుంచి అద్దంకికి వస్తున్న యువతికి ఆటో ఢీకొట్టటంతో గాయాలయ్యాయి. ఈఘటన శుక్రవారం అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకికి చెందిన వందవాసి పూజిత ఒంగోలులోని కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు స్కూటీపై వెళ్లి సాయంత్రం తిరిగి వస్తోంది. మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై నున్న అద్దంకిలోని మధురానగర్ వద్దకు రాగానే స్కూటీని ఆటో ఢీకొట్టటంతో పూజిత గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు


మహిళకు సర్టిఫికెట్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్


కూకట్లపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్
- సర్టిఫికెట్లు పంపిణీ చేసిన శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

వేటపాలెం/చీరాల: ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారం కావడానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఉపయోగపడుతోందని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శుక్రవారం చీరాల పట్టణంలోని వైకుంఠపురం-2, విఠల్‌నగర్ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. సచివాలయాల పరిధిలో 1134 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశామన్నారు. గతంలో సచివాలయ వ్యవస్థ లేని సమయంలో మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ప్రజల పనులు వెంటనే అవుతున్నాయన్నారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సారథ్యంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఏ సమస్య వచ్చిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసి కి మరలా సీఎంగా జగనన్నను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డీఈ ఏసయ్య, ఈసర్ల సుజాత, అప్పల అరుణ, షేక్ సుభాని, అప్పల శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాతురున్నీసా, షేక్ రియాజ్, కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకర్, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కె.యానాదిరావు, మించాల సాంబశివరావు, మల్లెల లలిత, కో–ఆప్షన్ సభ్యులు కోడూరి నాగ జ్యోతి, షేక్ కబీర్, అన్నం సతీష్, కోలా శివ, డొక్కా ప్రవీణ్, గోలి గంగాధర్, వార్డు ఇన్‌చార్జులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ సభ్యులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం మండలం దేశాయిపేట సచివాలయం–1, 4 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం రెండు సచివాలయాల పరిధిలో 4200 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే నేతాజీ, డిటీ తహశీల్దార్ మహేశ్వరి, ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, ఏఈ సుబ్బారావు, ఏపీఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ చల్లా జనార్దన్, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, బొడ్డు సుబ్బారావు, కర్ణ లక్షరావు, కర్ణ ప్రసాద్, దంత హనుమంతరావు, పృథ్వీ చంద్రమోహన్, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష అర్హులకు వరం..

బల్లికురవ/అద్దంకి రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జనన్న సురక్ష ఓ వరమని, 11 రకాల సేవలు గ్రామాల్లోనే అందుతున్నాయని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శుక్రవారం వెలమవారిపాలెం, కూకట్లపల్లి గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష క్యాక్రమంలో వివిధ రకాల పత్రాలు పంపిణీ చేశారు. జగనన్న పాలనను ఇతర రాష్ట్రాలు సైతం మెచ్చుకున్నాయని చెప్పారు. అంతేకాక ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలతోపాటు అన్ని రకాలసేవలు అదించడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చైతన్య అన్నారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు, శ్రీనివాసరావు, తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీవో సీహెచ్‌కృష్ణ, ఐవీ సుబ్బారెడ్డి, జేఏసీ మండల అధ్యక్షుడు టి. నరేష్, ప్రతాప్, ఈవో ఆర్డీ సుమతీ అధికారులు పాల్గొన్నారు.

సంతమాగులూరు మండలంలోని ఫత్తేపురం, అడవిపాలెం గ్రామాల్లో, అద్దంకిలోని ముజావారిపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో కృష్ణచైతన్య పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంతమాగులూరు మండల అధికారులు, నాయకులు, అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్ ఏస్తేరమ్మ, వైస్ చైర్మన్‌లు పద్మేష్, అనంత లక్ష్మీ వార్డు కౌన్సిలర్‌లు, సచివాలయ కన్వీనర్లు, మండల, నాయకులు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేతన్న నేస్తంతో చేనేతలకు జవసత్వాలు


నేత కార్మికులకు చెక్ పంపిణీ చేస్తున్న ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్

మార్టూరు: గత ప్రభుత్వ హయాంలో కడుపు నిండా తిండికి సైతం నోచుకోక దివాళ దిశగా పయనిస్తున్న చేనేత రంగానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకంతో తిరిగి జవసత్వాలు నింపారని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. నేతన్న నేస్తం ఐదో విడత కార్యక్రమంలో భాగంగా వలపర్ల గ్రామంలోని దత్తసాయి కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ, పవర్‌లూమ్ మరమగ్గాల రాకతో నేత కార్మికులు పోటీపడలేక మరో వృత్తి చేతకాక దిక్కుతోచని స్థితిలో ఉన్న కార్మికుల బాధలను నాటి పాదయాత్రలో గమనించిన జగన్ అధికారం చేపట్టాక నేతన్న నేస్తం పథకంతో ఆదుకుంటున్నారని ఆమంచి అన్నారు. ఒక్క వలపర్ల గ్రామంలోనే ప్రస్తుతం 288 మంది నేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.24 వేలు చొప్పున రూ. 68.64 లక్షలు వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారని, మొత్తం 5 విడతల్లో అక్షరాల రూ 3.09 కోట్లు కార్మికులకు పంపిణీ చేశారని ఆయన గుర్తు చేశారు. చేనేత మగ్గంపై జాతీయ జెండాను నేయడం ద్వారా జాతీయస్థాయి ఖ్యాతి గడించిన చేనేత కార్మికులకు సీఎం ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. మనం కూడా ఆయన వెన్నంటే నిలిచి ఆయనను మరోసారి సీఎం కావడం కోసం కృషి చేద్దామని ఆమంచి పిలుపునిచ్చారు. అనంతరం మహిళా నేత కార్మికులకు చెక్ అందజేశారు. సర్పంచ్ టీ బ్రహ్మయ్య ఆమంచిని సత్కరించి ఘనంగా సన్మానించారు. కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై సీఎం జగన్ వెంకటగిరి సభలో నిర్వహించిన కార్యక్రమాన్ని నేత కార్మికులతో కలిసి ఆయన వీక్షించారు. వలపర్ల గ్రామస్తులు ఆమంచికి ఘన స్వాగతం పలికారు. సినిమా హాలు సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ బాబు, ఎంపీడీవో కే కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి శిరీష, జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, స్థానిక నాయకులు కే కోటి నాగులు, దామర్ల శ్రీను, మాజీ డైరీ చైర్మన్ చెంగలయ్య, పఠాన్ కాలేషావలి, ఆజీం, జేవీ నారాయణ బాబు, గడ్డం మస్తాన్‌వలి, టీ వెంకటరావు పాల్గొన్నారు.


థాంక్యూ సీఎం అంటున్న మహిళా కార్మికులు

ప్రతి గడపకూ ప్రభుత్వ పథకం


వృద్ధురాలితో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య


గ్రామంలో పర్యటిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య, నాయకులు

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి: ప్రతి గడపకూ నవరత్నాల పథకాలు అందాయని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సచివాలయ పరిధిలో రెండో రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఆయన నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వారికి ఏయే పథకాలు ప్రభుత్వం నుంచి అందాయో చెప్పి, వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సుపరిపాలనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ఈ రెండు వ్యవస్థలతో పథకాల్లో పారదర్శకత ఏర్పడిందన్నారు. గడప గడప నిధులతో ప్రాధాన్యత క్రమంలో అత్యవసరమైన పనులు గుర్తించి చేయిస్తామని చెప్పారు. సుపరిపాలన అందిస్తూ, చెప్పిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తున్న ముఖ్యమంత్రిని రాబోయో ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కల్లబొల్లి కబుర్లు చెప్పే వారి మాటలు నమ్మి మోసపోకుండా మేలు చేసిన వారినే మరలా ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మన్నం శ్రీనివాసరావు, మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, నాయకులు, గంగినీడి సుబ్బారావు, తోకల వీరాంజనేయులు, జ్యోతి హరికృష్ణ, అడుసుమల్లి రామాంజనేయులు, నర్రా రాఘవరావు, మోటుపల్లి రామయ్య, వెంగల శెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వలంటీర్లు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో మొదటి స్థానంలో కావూరివారిపాలెం


ఉద్యోగులతో మాట్లాడుతునన తహశీల్దార్ ప్రభాకరరావు

చీరాల టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంలో ప్రజలకు కావాల్సిన అన్నీ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించి రాష్ట్రంలో మొదటి స్థానంలో కావూరివారిపాలెం గ్రామ సచివాలయం నిలిచిందని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం కావూరివారిపాలెం సచివాలయాలన్ని తహశీల్దార్ సందర్శించి విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను అభినందించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని అందుకు నిదర్శనంగా కావూరివారిపాలెం సచివాలయం రాష్ట్రంలోనే అత్యధిక 6671 సేవలందించి మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. రూరల్ మండలంలోని సచివాలయాలు 35475 సర్వీసులు, చీరాల అర్బన్ పరిధిలోని సచివాలయాలు 16731 సర్వీసులు మొత్తం 52206 సర్వీసులు అందించి జిల్లాలో కూడా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లుకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో యోగేంద్ర ప్రసాద్, సెక్రటరీ గౌస్ భేగం, ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈ బదిలీ

మేదరమెట్ల: కొరిశపాడు మండల విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ గుంటూరు బదిలీ అయినట్లు ఈఈ మస్తాన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో మండలంలో కొత్త ఏఈని నియమించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి

చీరాల టౌన్: ఇంటి పట్టా పొందిన లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వాడరేవు గ్రామ పంచాయతీలోని జగనన్న లే అవుట్‌లో ఇంటి నిర్మాణ పనులను ఏఈ పనులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో హౌసింగ్ అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఈ మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు సాయం చేస్తున్నట్లు తెలిపారు. పొదుపు మహిళలైతే వారికి అదనంగా వైఎస్సార్ కేపీ ద్వారా రూ.35 వేలు అదనపు రుణం అందిస్తుందని, ఇంటి పట్టా పొందిన లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయితీ సెక్రటరీలు, సచివాలయాల ఉద్యోగులు, పాల్గొన్నారు.

అధిక ఓల్టేజీతో గృహోపకరణలు దగ్ధం

అద్దంకి రూరల్: విద్యుత్ సరఫరాలో అధిక ఓల్టేజీ రావటంతో అద్దంకి పట్టణంలోని ఒక బజారులో 10 ఇండ్లలోని గృహోపకరణలు కాలిపోయిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కాకానిపాలెం వాటర్ ట్యాంక్ బజార్‌లోని ఇళ్లకు కొన్ని రోజుల నుంచి విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గుల వోల్టేజీ వస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం ఒక్కసారిగా ఓల్టేజీ అధికంగా రావటంతో ఇళ్లలోని ఫ్యాన్‌లు, టీవీలు, కుక్కర్లు, ఏసీలు కాలిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎండీఎంలో నాణ్యత తప్పనిసరి

చినగంజాం: మధ్యాహ్న భోజనం పాఠశాలలోని విద్యార్థులంతా ఆసక్తిగా తీసుకునేలా ఉండాలని ఎంఈఓలు బీ అజయ్‌బాబు, ఎన్ కోటేశ్వరరావులు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీలతో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం వంట చేయాలని, వంట తయారీలో అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల కుకింగ్ ఏజెన్సీలతో పాటు సీఆర్పీలు సురేంద్ర, సునీల్, ఆశీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

25న విద్యుత్ సమస్యలకు పరిష్కారం

మార్టూరు: దీర్ఘ కాలంగా వలపర్ల గ్రామస్తులు తీవ్రంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వ తేదీ మంగళవారం గ్రామంలో విద్యుత్ అధికారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక కళ్యాణ మండపంలో నేతన్న నేస్తం పథకంలో పాల్గొన్న ఆమంచిని గ్రామస్తులు కలిసి విద్యుత్ సమస్యలపై విన్నవించారు. ఈ క్రమంలో ఆయన మార్టూరు విద్యుత్ ఏడీఈ ఎం సురేంద్ర బాబును పిలిపించి మంగళవారం వలపర్లలో విద్యుత్ వినియోగదారులతో ఏర్పాటు చేసే సమావేశంలో పాల్గొని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో బెంబేలు

పర్చూరు (చినగంజాం): పర్చూరు మండలంలో ప్రకటిత విద్యుత్ కోత సర్వసాధారణ అయింది. వేళాపాళా లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు కోత విధించడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. కరెంటు ఎప్పుడు తీస్తారో ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. నివాస గృహాల్లో విద్యుత్ సహాయంతో చేసే పనులకు సైతం తీవ్ర అవరోధం ఏర్పడింది. దాంతో గృహిణులు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు పోయిందంటే గంటల తరబడి అందుకోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ కార్యాలయానికి ఫోన్ చేసినా అధికారులు స్పందించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. రాత్రి వేళ విద్యుత్ కోత కారణంగా ఫ్యాన్లు పనిచేయక పోవడంతో దోమల బెడదతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ కోతలు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకొని ప్రజలు ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

వలంటీర్లు మీకు సలాం..

యద్దనపూడి/మార్టూరు: మహోన్నత లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ సత్ఫలితాలను ఇస్తోంది. సామాజిక పింఛన్లు కాని, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, ఏ ప్రభుత్వ పథకమైనా నేరుగా లబ్ధిదారులకు అందిస్తూ అందరితో శబాష్ అనిపించుకుంటున్నారు వలంటీర్లు. 50 ఇళ్లకు నియమించిన వలంటీర్ల ద్వారా ప్రజలు అన్నీ రకాల సేవలను పొందుతున్నారు.

వలంటీర్ సేవలు అమోఘం..

నా పేరు దేవగిరి కోటిరెడ్డి, మాది యద్దనపూడి మండలం గన్నవరం గ్రామం. వలంటీర్‌లు అందిస్తున్న సేవలు అమోఘంగా ఉన్నాయి. నేను గుంటూరు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఉన్న సమయంలో వలంటీర్ అక్కడకు వచ్చి పింఛను ఇవ్వడంతో పాటు వేలి ముద్రలు వేయించుకొని రైతు భరోసా పథకాలు అందించాడు. వలంటీర్ కాకాని వంశీని మా కుటుంబానికి సేవలందిస్తున్నాడు కనుక ఎప్పుడు నేను, మా కుటుంబ సభ్యులు మా ఇంటిలోని ఓ మనిషిగా భావిస్తాం.


కోటిరెడ్డి నుంచి వేలి ముద్ర వేయించుకుంట్ను వలంటీర్ వంశీ

ఎన్నో సేవలు పొందుతున్నాం..

నేను చదువు రాని ఒంటరి మహిళను. అలాంటి నేను మా వార్డు వలంటీర్ ద్వారా ఒంటరి మహిళ పెన్షన్‌తో పాటు చేయూత పథకం ద్వారా లబ్ధి పొందాను. అంతేకాక ఇల్లు లేని నాకు జగనన్న లే అవుట్‌లో ఇంటి స్థలం మంజు కావటానికి మా వలంటీర్ అంకమ్మరావు అందించిన సేవలే కారణం. ఇలాంటి వలంటీర్‌లను ఏర్పాటు చేసి మా ఇంటి వద్దకే సేవలు అందిస్తున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలు.



- తన్నీరు వరలక్ష్మి, మార్టూరు

విద్యార్థినికి అభినందనలు


విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ఎంఈవో

అద్దంకి రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామ జిల్లా ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని చాగంటి హసినిని ఎంఈవో బీ. సుధాకరరావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థినికి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కపర్ధి, నారాయణరావు, సుబ్బారావు, బాషా, పార్థసారథి, లక్ష్మీ కుమారి, శ్రీనివాసరావు పాల్గొని అభినందించారు.